# మానవ సంబంధాలు - వ్యక్తిత్వ వికాసం
## విమర్శ

ప్రస్తుత కాలంలో ప్రపంచం ఓ కుగ్రామంగా మారింది. కాని మనుషులు మధ్య అంతరాలు పెరిగాయి. ప్రేమ, స్నేహం, అప్యాయత, ఆత్మీయత, అనురాగాలు తరుగుతున్నాయి. ఇది ఈనాటి ప్రపంచ మానవాళి ఎదుర్కొంటున్న అంతర్జాతీయ సమస్య. అందుకే మానవ విలువలు మళ్లీ వికసించాలనీ, మమతానురాగాలు వెల్లువై ప్రవహించాలని, అంతర్జాతీయ స్థాయిలో మానవ సంబంధాలపై చర్చలు, సదస్సులు, సమావేశాలు అన్ని దేశాలలో జరుగుతున్నాయి. నాణ్యమైన విద్యకావాలాంటూ ప్రపంచ దేశాలు అనేక పథకాలను రూపొందిస్తున్నాయి.

మనం కోరుకుంటున్న మానవ సంబంధాలకుమూలం వ్యక్తిత్వ వికాసం. ఎవరికి వారు వికాసం చెందే ప్రయత్నంలో ప్రపంచ మానవ సంబంధాలు మెరుగువుతాయి. వ్యక్తిత్వ వికాసానికి మూలమైన జీవన సూత్రాలలో విమర్శ ముఖ్యమైనది.

ఒక విషయానికి సంబంధించిన విశిష్టజ్ఞానాన్నే విమర్శ అంటాం. దేని గురించైనా కూలంకషంగా పరిశీలించడం, శోధించడం కూడా విమర్శవుతుంది. చేసిన మంచి పనిని గుర్తిస్తూ ఆ పనిని మరింత నైపుణ్యంగా చేయలేక పోవడానికి గల కారణాల్ని విశదీకరించడాన్నే విమర్శగా భావించాలి. ఒక వ్యక్తినో, ఒకపనినో, ఒక విషయాన్నో గురించి వ్యతిరేక భావంతో తప్పుగా గుర్తించడాన్ని సాధారణ వాడకంలో విమర్శగా భావిస్తున్నాం.

విమర్శవల్ల ఆయాఅంశాలకు సంబంధించిన గుణదోషాలు వెల్లడవుతాయి. అందుకోసం బుద్ధిమంతుడైన వాడు విమర్శల్ని ఆహ్వానిస్తాడు. మన ప్రవర్తన, మన నిజస్వరూపం ఇతరులు చేసే విమర్శల వల్లే గుర్తించగలుగుతాము. విమర్శనేది నిష్పక్షపాతంగా రాగద్వేషాలకు అతీతంగా ఉండాలి. అప్పుడే అది నిజమైన విమర్శవుతుంది.

కొంతమంది ఏ ప్రయోజనం లేకపోయినా అసూయా ద్వేషాలతో అనవసరమైన విమర్శలు చేస్తుంటారు. వాటి వల్ల ఏ ప్రయోజనం లేకపోగా ఒక్కోసారి ప్రాణాలమీదికొస్తుంది. ఆ రకంగా అకారణవైరంతో విమర్శచేసి ప్రాణాలు పోగొట్టుకున్నవాడే శిశుపాలుడు.

భీష్మాచార్యులవారి సూచనమేరకు రాజసూయ యాగ పరిసమాప్తి సమయంలో శ్రీకృష్ణపరమాత్మకు అగ్రపూజ చేయడానికి నిశ్చయింపబడుతుంది. భీష్మలవారు అగ్రపూజకు శ్రీకృష్ణుని సూచిస్తూ

'ఆదిత్యశ్చంద్రమాశ్చైవ నక్షత్రాణిగ్రహశ్చయే।
దిశశ్చవిదిశ్చైవ సర్వంకృష్ణేప్రతిష్ఠితమ్॥

సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, గ్రహాలు, దిక్కులు- అన్నీ శ్రీకృష్ణునియందే ప్రతిష్టితములై ఉన్నాయని వివరిస్తాడు. అసూయా ద్వేషాలతో చేదిరాజైన శిశుపాలుడు అందుకు అంగీకరించక అఖిలలోక పూజ్యుడు యజ్ఞపురుషుడైన శ్రీకృష్ణుని విమర్శిస్తూ - దాశార్హుండు పూజార్హుడే' అంటూ ధర్మరాజును, భీష్మలవారిని, శ్రీకృష్ణపరమాత్మని- అందరిని విమర్శిస్తాడు. తత్ఫలితంగా మరణాన్ని కొనితెచ్చుకున్నాడు.

అనవసరంగా ఎక్కువ మాట్లాడటం వల్ల మనకు తెలియకుండానే అసంబద్ధ విమర్శలు చేయటం జరుగుతుంది. ఇతరులతో మాట్లాడేటప్పుడు సహేతుకంగా ఉండే సత్యమైన మాటలే మాట్లాడాలి. సరళంగా సానుభూతితో కూడిన మంచిమాటల్నే పలకాలి. విమర్శతో కూడిన అనవసర ప్రసంగాల వల్ల సత్ఫలితాలు లేకపోగా మంచిగా ఉండే మానవ సంబంధాలు దెబ్బతింటాయి.

'నతువృథా వాక్యం సుముచ్చార్యతామ్' అంటారు జగద్గురుశంకరాచార్యులవారు. విమర్శ చేయడమే ధ్యేయంగా పెట్టుకునేవాళ్ళ మాటలు అధికప్రసంగాలుగా మారి అనర్థాలకు దారితీస్తాయి.

సాధారణంగా కొంతమంది ఇతరుల తప్పులను పట్టుకుంటూ విమర్శ చేయడమే పనిగా ఉంటారు. వాళ్ళ తప్పుల గురించిమాత్రం ఆలోచింపరు. అదేపనిగా అవతలి వాళ్ళను విమర్శించడం, వాళ్ళు చేసిన తప్పుల్ని గోరంతల్ని కొండంతలు చెయ్యడం చేస్తుంటారు.

తప్పులెన్ను వారు తండోపతండంబు
ఉర్వీజనుల కెల్ల నుండుతప్పు
తప్పులెన్ను వారు తమ తప్పులెరుగరు
విశ్వదాభిరామ వినురవేమ

అంటాడు యోగి వేమన. కాబట్టి ప్రతివాళ్ళు తమతమ తప్పుల్ని గురించి తెలుసుకుని ప్రవర్తించాలి.

'ఆత్మానం విజానీయత్'

నిన్ను నీవు తెలుసుకో అంటుంది ఉపనిషద్వాక్యం. ప్రతి వ్యక్తి నిత్యజీవితంలో ఆత్మవిమర్శ చేసుకుంటూ మంచి మార్గం లో నడవాలి. ఆత్మవిమర్శ ద్వారా ఔనత్యాన్ని సాధించగలుగుతాం.

మనగురించి అవతలి వాళ్ళు చేసే విమర్శ కొంత అప్రియంగాను, కఠినంగాను ఉన్నట్టు కన్పిస్తాయి. అలా ఉన్న ప్పటికీ మనకు హితం చేసే విమర్శల్ని సాదరంగా ఆహ్వానించగలగాలి.

రావణాసురుడు సీతాపహరణం కోసం సహాయం చేయాల్సిందిగా మారీచుణ్ని అడుగుతాడు. అప్పుడు తాపసిగా ఉన్న మారీచుడు

సులభాఃపురుషారాజన్ సతతంప్రియవాదినః
అప్రియస్యతు పథ్యస్య వక్తాశ్రోతాచ దుర్లభః

రాజా వినడానికి ప్రియంగా ఉండేమాటలు చెప్పే వాళ్లు చాలా సులభంగా దొరుకుతారు. అప్రియమైనా హితం చెప్పే వాళ్ళు - అప్రియంగా ఉండే విమర్శను వినేవాళ్ళు చాలా దుర్లభంగా ఉంటారు. నీ ప్రయత్నం అజ్ఞానానికి నిదర్శ నం. ఆ మహనీయుని భార్యను అపహరించడం తుచ్ఛమైన పని. శ్రీరామునితో యుద్ధం నీ వంశనాశనానికి దారితీస్తుం దంటూ నీతిబోధ చేస్తాడు.

అశోకవనవిధ్వంససమయంలో క్రోధమూర్ఛితుడైన రావణాసురుడు, హనుమంతుణ్ని చంపివేయమని ఆజ్ఞాపి స్తాడు. సభలో విభీషణుడు దూత, నిరపరాధియైన ఆంజనేయస్వామిని చంపటం ధర్మ విరుద్ధమని-

'రాజధర్మవిరుద్ధంచ లోకవృత్తేశ్చగర్హితమ్'

దూతనువధించడంవల్ల 'శాస్త్ర విపశ్చిత్త్వం శ్రమేఏవహికేవలం'
నీశాస్త్రపాండిత్యం వృథా, వ్యర్థమైనప్రయాసంటూ విమర్శిస్తాడు. రావణాసురుడు తన నిర్ణయం మార్చుకుంటాడు.
సద్విమర్శచేయటం ఆత్మవిమర్శ చేసుకోవడం విజ్ఞుని లక్షణం. ఆత్మవిమర్శ ద్వారా ఔనత్యాన్ని సాధిద్దాం

* * * *